
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 28 జనవరి 2024

ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో అధికార పార్టీ పరిస్థితి జిల్లాలో గందరగోళంగా మారింది. ఇన్‌చార్జిల పేరుతో చేసిన మార్పులు వైసీపీ శ్రేణులను అయోమయానికి గురి చేస్తున్నాయి. సత్యవేడును వదిలి తిరుపతి ఎంపీ స్థానం నుంచీ పోటీకి ఆదిమూలం సిద్ధంగా లేరు. అసంతృప్తిగానే గురుమూర్తి సత్యవేడుకు సిద్ధపడ్డా ఆయనకు పార్టీ శ్రేణుల సహకారం లభించే సూచనలు కనిపించడం లేదు. సూళ్లూరుపేటలో ఎంత హెచ్చరించినా వైసీపీ అసమ్మతి వర్గం సంజీవయ్యను సవాల్ చేస్తూనే వుంది. టికెట్ లేదన్నాక గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ సొంతదారులు వెతుక్కుంటున్నారు. జగన్ రెడ్డికి బుర్రలో ఏ పురుగు తొలిచిందో గానీ ఎన్నికల వేళ ఇవేం గందరగోళం మార్పులంటూ పార్టీ శ్రేణులు అయోమయంలో పడిపోయి అగ్గిమీద గుగ్గిలం అవుతున్నాయి. జగన్ చేసిన మార్పుల్లో వేటు పడిందంతా ఎస్సీ ఎమ్మెల్యేల మీదే కావడంతో వైసీపీకి బలమైన అండగా ఉన్న ఆ వర్గంలో అసహనం పెరుగుతోంది.



- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీలో భగభగలు

ఎన్నికల వేళ ఆందోళనలో పార్టీ శ్రేణులు

సత్యవేడు ఆత్మీయభేటీకి ఆదిమూలం డుమ్మా



సత్యవేడు శ్రేణుల సమావేశంలో పెద్దిరెడ్డి,గురుమూర్తి

తిరుపతిలో శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిధిగా సత్యవేడు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఇటీవల సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని తిరుపతి లోక్‌సభ ఇంచార్జిగానూ, తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు సెగ్మెంట్ ఇంచార్జిగానూ అధిష్ఠానం ప్రకటించిన నేపథ్యంలో అందరినీ కూడగట్టడానికి ఈ సమావేశం నిర్వహించారు. అయితే ఏకంగా ఎమ్మెల్యే ఆదిమూలమే ఆత్మీయ సమావేశానికి డుమ్మా కొట్టారు. లోపల అసంతృప్తి ఉన్నా, సత్యవేడు నుంచి పోటీకి తిరుపతి ఎంపీ గురుమూర్తి మానసికంగా సిద్ధపడ్డారు.నియోజకవర్గంలోని ఏడు మండలాలూ పర్యటించి ముఖ్య నాయకులను కలుసుకున్నారు. అయితే ఆదిమూలం మాత్రం తిరుపతి ఎంపీగా పోటీ చేయడానికి ఏమాత్రం ఇష్టపడడం లేదని సమాచారం. తనను అసెంబ్లీ సీటు నుంచీ తప్పించడం పట్ల తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్టు చెబుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకూ నారాయణవనం, నాగలాపురం మండలాల్లో ఆదిమూలం రెండు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆదిమూలం నివాసానికి ఎంపీ గురుమూర్తి వెళ్ళగా ఇంట్లో వుండి కూడా లేడని చెప్పించారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. శనివారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో జరిగిన సమావేశానికే ఆయన హాజరు కాకపోవడం ఒక నిరసన సంకేతంగానే భావించాల్సి ఉంటుంది. అనారోగ్యం కారణంగా సమావేశానికి రాలేదని నేతలు చెబుతున్నా అది సాకు మాత్రమేనని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.మరోవైపు ఆదిమూలం తన సన్నిహితులతో, గురుమూర్తికి సత్యవేడు టికెట్ రాదని చెబుతున్నట్టు సమాచారం. అంతే కాకుండా సత్యవేడు కో ఆర్డినేటర్‌గా నియమితులైన ఎంపీ గురుమూర్తిని పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కల వ గా, అందులో కొందరిపై ఆదిమూలం ఆగ్రహం వ్యక్తం చేసినట్టు కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో సత్యవేడు వైసీపీలో వర్గ పోరు భగభగ రగులుతున్నట్టు అర్థం అవుతోంది.

పార్టీ, ప్లేస్ ఏదైనా పోటీ పక్కా అంటున్న వరప్రసాద్

టికెట్ గల్లంతైన నేపథ్యంలో గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు ప్రత్యామ్నాయం కోసం వేగంగా అడుగులు వేస్తున్నారు. గూడూరు నుంచీ తిరిగి అవకాశం లేదని తేలిపోయాక ఆయన తిరుపతి ఎంపీ స్థానంపై ఆశపడ్డారు. అక్కడి నుంచీ అవకాశం లేదని స్పష్టం అయ్యింది. కనీసం సూళ్ళూరు పేటపై ఆశలు పెట్టుకుందామనుకున్నా అక్కడ సిటింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు అధిష్ఠానం టికెట్‌పై హామీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. వైసీపీలో దారులన్నీ మూసుకుపోవడంతో జనసేన, టీడీపీల వైపు వరప్రసాద్ చూస్తున్నారు. శుక్రవారం సూళ్ళూరుపేటలో తనకు గతంలో సన్నిహిత అనుచరులుగా వున్న ఓ సామాజికవర్గంతో ప్రత్యేకంగా సమావేశయ్యారు. అలాగే నాయుడుపేటలో పలువురు వైసీపీ నాయకుల ఇళ్ళకు వెళ్ళి కలిశారు. ముఖ్యంగా కిలివేటి సంజీవయ్యను వ్యతిరేకిస్తున్న నాయకులతో భేటీ అవుతున్నారు. తాను ఏదో ఒక పార్టీ నుంచీ టికెట్ తెచ్చుకుంటానని తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నట్టు తెలిసింది. ప్రాథమికంగా జనసేన తరపున గూడూరు, సూళ్ళూరుపేట, సత్యవేడుల్లో ఒక చోట నుంచీ గానీ లేదా తిరుపతి ఎంపీగా గానీ పోటీ చేసే అవకాశాలున్నాయని ఆయన చెబుతున్నట్టు తెలిసింది. దీంతో కిలివేటి సంజీవయ్యను వ్యతిరేకిస్తున్న నేతలు జనసేన నుంచీ కాకుండా టీడీపీ నుంచీ టికెట్ తెచ్చుకుంటే తాము పనిచేస్తామని హామీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.

రోజాపై అవినీతి మరక

నగరిలో రోజా పరిస్థితి కూడా రోజురోజుకీ గడ్డుగా మారుతోంది. పుత్తూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి కోసం తనను మంత్రి రోజా డబ్బు అడిగారని, మంత్రి ఆదేశానుసారం ఆమె సోదరుడికి మూడు విడతలుగా రూ. 40 లక్షలు అందజేశానని 17వ వార్డు వైసీపీ కౌన్సిలర్ భువనేశ్వరి చేసిన ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. డబ్బు వెనక్కివ్వమని అడిగినందుకు మంత్రి సోదరుడి అనుచరులు వేధిస్తున్నారని కూడా వాపోయారు. దీనిపై పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి మంత్రికి మద్దతుగా భువనేశ్వరి ఆరోపణలను ఖండించినా, కాణిపాకంలో ప్రమాణానికి ఆమె ఆ వెంటనే సవాల్ విసిరారు. దానికి ఇంతవరకూ మంత్రి నుంచీ గానీ, ఆమె అనుచరవర్గం నుంచీ గానీ సమాధానం లేదు.డబ్బు తీసుకోని పక్షంలో సవాల్ స్వీకరించి ప్రమాణానికి సిద్ధమని ఎందుకు ప్రకటించడం లేదన్న ప్రశ్న అన్ని వర్గాల నుంచీ వినిపిస్తోంది. ఈ పరిస్థితి పార్టీ శ్రేణుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తోంది. అసలే గత రెండు ఎన్నికల్లోనూ బొటాబొటీ మెజారిటీతో గెలిచిన మంత్రికి ఇపుడు సొంత సెగ్మెంట్‌లో సొంత పార్టీ నేతల నుంచే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాజా అవినీతి ఆరోపణలు పార్టీని కుదిపివేస్తున్నాయి.

తిరుపతి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా నీహారిక?



తిరుపతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా రిటైర్డు ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె అంగలకుర్తి నీహారిక పేరు ఖరారైనట్టు తెలుస్తోంది. ఈమె సత్యవేడు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ తలారి మనోహర్ చిన్న కోడలు కూడా. నిజానికి తిరుపతి ఎంపీ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి పేరునే పరిశీలించారని, అయితే ఆమె ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపడం లేదని, తన భర్తకు అసెంబ్లీ టికెట్ కోరుతున్నారని సమాచారం. దీంతో ప్రత్యామ్నాయం గా పలు పేర్లను పరిశీలించారు. ఈ క్రమంలోనే గత తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీచేసిన రిటైర్డు ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె నీహారిక పేరు టీడీపీ అధిష్ఠానం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆమె టీడీపీ తొలితరం రాజ్యసభ సభ్యుడు, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే తలారి మనోహర్ చిన్న కోడలు. మనోహర్ పెద్ద కుమారుడు తలారి ఆదిత్య 2014-19 నడుమ సత్యవేడు ఎమ్మెల్యేగా టీడీపీ నుంచీ గెలిచిన సంగతి తెలిసిందే. విద్యాధికురాలైన యువతి కావడం, తల్లి సీనియర్ బ్యూరోక్రాట్‌గా పనిచేసివుండడం, భర్త వైపు నుంచీ మామ, బావ ఎంపీ, ఎమ్మెల్యేలుగా పని చేసి వుండడంతో ఆమె తిరుపతి ఎంపీ స్థానానికి దీటైన అభ్యర్థి కాగలదని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గంలో టీడీపీకి సాంప్రదాయకంగా వున్న బలానికి తోడు పొత్తు కారణంగా జనసేన మద్దతు అదనపు బలం కానుంది. నీహారిక అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశముంది.



షర్మిలకు తిరుపతి కాంగ్రెస్ నేతల స్వాగతం

- నేడు చిత్తూరు, తిరుపతి జిల్లాల కాంగ్రెస్ శ్రేణులతో సమావేశం

తిరుపతిలో వైఎస్ షర్మిల

తిరుపతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం రాత్రి తిరుపతి చేరుకున్నారు. ఆదివారం చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆమె పాల్గొంటారు. ఉదయం 10 గంటల నుంచీ మధ్యాహ్నం 12 వరకూ నగరంలోని రామతులసీ కళ్యాణ మండపంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఆ సందర్భంగా రెండు జిల్లాల్లో పార్టీ స్థితిగతులను తెలుసుకోవడంతో పాటు పార్టీ పునర్నిర్మాణానికి సంబంధించిన దిశా నిర్దేశం చేయనున్నారు. సమావేశంలో ఆమెతో పాటు పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు, ముఖ్య నేతలు జేడీ శీలం, తాంతియా కుమారి, కొప్పుల రాజు, తులసిరెడ్డి, జంగా గౌతమ్, కొరివి వినయ్‌కుమార్, యువజన కాంగ్రెస్ నేత రామారావు, ఎన్‌ఎస్‌యూఐ నేత నాగ మధు తదితరులు సమావేశంలో పాల్గొననున్నారు.కాంగ్రెస్ పార్టీలో చేరి, పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా షర్మిల వస్తున్న నేపథ్యంలో తొలి సమావేశానికి వీలైనంత మంది కార్యకర్తలను రప్పించాలని నేతలు యత్నిస్తున్నారు. అందులో భాగంగా రెండు జిల్లాల పరిధిలో కార్యకర్తలను, పార్టీ అభిమానులను గుర్తించి వారికి వ్యక్తిగతంగా ఆహ్వానం పంపినట్టు సమాచారం.కాగా నెల్లూరు నుంచీ శనివారం రాత్రి తిరుపతి చేరుకున్న షర్మిలకు ఘన స్వాగతం లభించింది. నగరంలోని తాజ్ హోటల్ వద్ద ఆమెకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జంగా గౌతమ్, రాకేష్‌రెడ్డి, పీసీపీ ఉపాధ్యక్షులు దొడ్డారెడ్డి రామ్‌భూపాల్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ నేత మద్దెల అమృత్ తేజ తదితరులు స్వాగతం పలికారు.ఆదివారం మధ్యాహ్నం పార్టీ శ్రేణులతో సమావేశం ముగిశాక ఆమె అనంతపురం వెళ్ళనున్నారు.

మృతి చెందిన రమేష్



విద్యుత్ ప్రమాదంలో వైరుదొంగ మృతి



దొరవారిసత్రం, జనవరి 27: ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరును అపహరించే ప్రయత్నంలో విద్యుత్ ప్రమాదానికి గురై ఓ దొంగ మృతి చెందాడు.పోలీసుల కథనం మేరకు ...దక్కిలి మండలం మాధవయ్యపాళెం గ్రామానికి చెందిన రమేష్(31)తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి వైరు అపహరిస్తుంటాడు. ఇతనిపై పలు స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయి.దొరవారిసత్రం మండలంలోని నెలబల్లి వాసమ్మ గుడి ఎదురుగా జాతీయ రహదారి పక్కన గల అడవిలో వున్న ట్రాన్స్‌ఫార్మర్ కొంతకాలం క్రితం పాడైంది.దీన్ని గమనించిన రమేష్ ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరును అపహరించేందుకు శుక్రవారం రాత్రి ప్రయత్నం చేశాడు.అయితే ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా ఉండడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు.శనివారం సాయంత్రం స్థానికులు రమేష్ శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.

బీజేపీ క్లస్టర్-4 ఇన్‌చార్జిగా సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 27: రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలను ఐదు క్లస్టర్లుగా విభజించి ఇన్‌చార్జి, కో ఇన్‌చార్జిలను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి శనివారం రాత్రి జాబితా విడుదల చేశారు. ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలను క్లస్టర్-4గా విభజించి ఇన్‌చార్జిగా తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని నియమించారు. అలాగే తిరుపతి ప్రాంతానికి చెందిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్‌ను క్లస్టర్-4 కో ఇన్‌చార్జిగా నియమించారు.

రేపటినుంచి విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

తిరుపతి(ఆటోనగర్), జనవరి 27 : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని తిరుపతి సర్కిల్ (ఉమ్మడి చిత్తూరు జిల్లా)లో సోమవారం నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణా మండలి (ఏపీఈఆర్సీ) విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతున్నట్టు ఎస్‌ఈ కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. తిరుపతి టౌన్, రూరల్ డివిజన్ల పరిధిలో ఉన్న వినియోగదారులకు ఎస్‌ఈ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్లకు సంబంధించి రూరల్ డివిజన్ కార్యాలయంలో, పుత్తూరు డివిజన్ కార్యాలయ పరిధిలోని వినియోగదారులకు పుత్తూరులో, మదనపల్లి, పుంగనూరు డివిజన్ పరిధిలోని వినియోగదారులకు మదనపల్లెలో, పీలేరు డివిజన్ పరిధిలోని వినియోగదారులకు పీలేరు డివిజన్ కేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు అభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఈ తెలిపారు.

జూనియర్ సివిల్ జడ్జిగా బంగారుపాళ్యం యువకుడి ఎంపిక



ఎం.రోహిత్

బంగారుపాళ్యం, జనవరి 27: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలోని ముంగరమడుగు గ్రామానికి చెందిన ఎం.రోహిత్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 2023లో నిర్వహించిన సివిల్ జడ్జి పరీక్ష ఫలితాలను శుక్రవారం హైకోర్టు విడుదల చేయగా ఓపెన్ కేటగిరీలో ఈయన ఎంపికయ్యారు. దీంతో రోహిత్‌ను శనివారం గ్రామస్తులు అభినందించారు.

శ్రీకాళహస్తిలో ఆగని కబ్జాల పర్వం

- రాజీవ్ నగర్‌లో ఆత్మహత్యాయత్నంతో రోడ్డెక్కిన మహిళ
- చలించని అధికార యంత్రాంగం



నాగమణి ఇంటిముందున్న స్థలంలో జరుగుతున్న నిర్మాణ పనులు - భోరున విలపిస్తున్న నాగమణి

శ్రీకాళహస్తి, జనవరి 27: ఓ మహిళ ఇంటి ముందున్న స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించి నిర్మాణం చేపట్టారు. కాళ్ల పట్టుకున్నప్పటికీ కనికరించకపోవడంతో కడుపు మండిన ఆ తల్లి చావుకు సిద్ధమైంది. గాజుతో ఎడమ చేతిని కోసుకొని కారుతున్న నెత్తుటి గాయాలతో ఇక చావే శరణ్యం అంటూ ఆక్రందనతో విలపించడం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి దుమారం వేపింది.బాధితురాలి కథనం మేరకు.... శ్రీకాళహస్తి పట్టణ శివారులోని సుమారు 19 ఏళ్ల క్రితం రాజీవ్ నగర్ కాలనీ ఏర్పడింది.పట్టణంలోని 35వార్డుల నుంచి పేదలను ఎంపిక చేసి రాజీవ్ నగర్‌లో నివాస స్థలాలను ప్రభుత్వం మంజూరు చేసింది. తొట్టంబేడు మండలంలోని రామచంద్రపురం, శివనాథపాలెం పంచాయతీల నుంచి శ్రీకాళహస్తి పురపాలక సంఘం ద్వారా భూములు కొనుగోలు చేసి మరీ పేదలకు ప్లాట్లను కేటాయించారు.తరువాత జరిగిన పరిణామాలతో చాలాస్థలాలు నిరుపయోగంగా మిగిలిపోయాయి. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ నేతలు కొందరు రాజీవ్ నగర్‌లో ఆ ఖాళీ స్థలాలపై కన్నేశారు.వందలాది స్థలాలను ఆక్రమించారు.అడిగిన వారిపై దాడులతో.. ప్రశ్నించిన వారిని వేధింపులతో భయపెట్టారు.ఇదిలా వుంటే శ్రీకాళహస్తి- పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ఏర్పాటు చేసిన రాజీవ్ నగర్ వద్ద భవిష్యత్తులో రోడ్డు విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా కొంత భూమిని వదిలి లబ్ధిదారులకు ప్లాట్లను పంపిణీ చేశారు. రహదారికి ఆనుకుని ఉన్న ఆ ఖాళీ జాగాలను ఇటీవల అధికార పార్టీ నాయకులు పలువురు ఆక్రమించి దుకాణాల కోసం షట్టర్లను ఏర్పాటు చేశారు.ఏడేళ్ల క్రితం కేవీబీపురం మండలానికి చెందిన నాగమణి అనే మహిళ బతుకు తెరువు కోసం ఇక్కడ రోడ్డు పక్కన ఒక స్థలం కొని ఇల్లు కట్టుకున్నారు.ఇంటి ముందరున్న స్థలంలో ఓ బల్లపై ఎండు చేపలు అమ్ముకుంటూ ఆమె జీవనం సాగిస్తున్నారు.ఆ స్థలంపై కూడా వైసీపీ నాయకులు కన్నేశారు.శుక్రవారం అక్కడ గది నిర్మాణానికి గుంతలు తవ్వడంతో నాగమణి అడ్డుకునే ప్రయత్నం చేశారు.అక్రమార్కుల కాళ్లు పట్టుకుని బతిమాలినా నిర్మాణం ఆపకపోవడంతో నాగమణి చేయి కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది.తనను చంపిన తరువాతే స్థలాన్ని ఆక్రమించుకోవాలని ఆవేదన వ్యక్తం చేసింది. కబ్జాను ఆపకపోతే ఇక పీక కోసుకొని చస్తా... అదొక్కటే నాకు దారి అంటూ ఆమె కన్నీటి పర్యంతమైన వీడియో శనివారం శ్రీకాళహస్తిలో వైరల్‌గా మారింది. తనకు జరిగిన అన్యాయంపై తొట్టంబేడు పోలీసులకు నాగమణి ఫిర్యాదు చేసింది. వైసీపీ నేతల దురాగతం ప్రజల్లో పెద్దఎత్తున చర్చనీయంశంగా మారింది. ఇంత జరిగినా అధికారయంత్రాంగం స్పందించకపోవడం విమర్శలపాలైంది.

8ఏళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

తిరుపతి, జనవరి 27: ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన ఏర్పేడు మండలంలో చోటుచేసుకుంది.పాపానాయుడుపేట సమీపం లోని ఓ గ్రామానికి చెందిన మహబూబ్ బాషా(40) అలియాస్ బాటోడు అదే గ్రామానికి చెందిన 8 ఏళ్ల చిన్నారికి కొంతకాలంగా మాయ మాటలు చెప్పి దగ్గరయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి జామకాయ ఇస్తానని చెప్పి తీసుకెళ్లిన మహబూబ్ బాషా అత్యాచారానికి ప్రయత్నించాడు. ఇంటికి ఆలస్యంగా రావడంతో తల్లిదండ్రులు అనుమానించి బాలికను ఆరా తీయగా అసలు విషయం బయటపడింది.ఏర్పేడు పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో బాలికను శనివారం చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు.మహబూబ్ బాషాను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోక్సో చట్టంతో పాటు అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

రెండున్నర కిలోల బంగారు, రూ.10 లక్షల నగదు స్వాధీనం

గూడూరు, జనవరి 27: గూడూరు రైల్వేస్టేషన్‌లో ఇద్దరు ప్రయాణికుల నుంచి రెండున్నర కిలోల బంగారు, రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు జీఆర్పీ ఎస్‌ఐ కొండప్పనాయుడు శనివారం తెలిపారు. జీఆర్పీ సిబ్బంది రైల్వేస్టేషన్‌లో సాధారణ తనిఖీలు చేపట్టారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన లోకనాథం, సాయికుమార్ బ్యాగులను తనిఖీ చేయగా రూ.1.50 కోట్ల విలువచేసే రెండున్నర కిలోల బంగారం, రూ 10.40 లక్షల నగదు గుర్తించారు. సరైన ధృవీకరణ పత్రాలను చూపించకపోవడంతో బంగారం, నగదును సీజ్ చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జీఆర్పీ ఎస్‌ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జయప్రకాష్, వెంకటసుబ్బయ్య, గణేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు ఎస్‌ఐలకు బదిలీలు

చిత్తూరు, జనవరి 27: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న జీడీవీ రమణను రాయదుర్గం అర్బన్‌కు, డి.సురేంద్రబాబును గుంతకల్ టూటౌన్‌కు, కె.పద్మావతిని అనంతపురం దిశ మహిళా స్టేషన్‌కు, సుగుణను అనంతపురం వన్‌టౌన్‌కు, దాసరా జనాయక్‌ను తాడిపత్రి టౌన్ పోలీసుస్టేషన్‌కి బదిలీ చేశారు. అలాగే తిరుపతిలో పనిచేస్తున్న ఎం.శ్రీనివాసులును పెద్దవడుగూరు స్టేషన్‌కు, సి.చలపతిని అనంతపురం సీసీఎస్‌కు, ఎస్.గిరిబాబును ఎల్లనూరు స్టేషన్‌కు, ఎంఎం వెంకటేశ్వర్లును గుమ్మగట్ట స్టేషన్‌కు, ఎస్‌జీ హేమాద్రిని పుట్లూరుకు బదిలీ చేశారు. ఈ మేరకు శనివారం అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

తిరుమలకు దివ్యాంగుడి పాదయాత్ర



తిరుపతి రూరల్, జనవరి 27: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మళ్లీ సీఎం కావాలని తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లెకు చెందిన దివ్యాంగుడు జీవన్‌కుమార్‌రెడ్డి తిరుమలకు పాదయాత్ర చేశారు. శ్రీవారి మెట్టు మార్గాన శనివారం ఆయన పాదయాత్రగా తిరుమలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. చంద్రబాబు సీఎం కావాలని ఇకపై ప్రతి శనివారం తిరుమలకు తాను పాదయాత్ర నిర్వహించనున్నట్టు జీవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దివ్యాంగులకు చంద్రబాబు సీఎంగా ఎన్నో ప్రయోజనాలు చేకూర్చారని అన్నారు. ప్రస్తుతం జగన్ దివ్యాంగులకు సహకరించ లేదని విమర్శించారు. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రంలోని దివ్యాంగులందరికీ అన్నివిధాలా న్యాయం జరుగుతుందని జీవన్‌కుమార్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ

చంద్రగిరి, జనవరి 27: చంద్రగిరి మండలం పాత శానంబట్లలో రూ.9 లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్మాణం కోసం శనివారం తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా అందజేసిన నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనార్ధన్‌రెడ్డి కుటుంబానికి వైఎస్ఆర్ ఆరోగ్య బీమా పథకం ద్వారా రూ.5 లక్షల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ యశోదశంకర్‌యాదవ్, ఎంపీటీసీ భారతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొటాలలో పీహెచ్‌సీలో వైద్యులేరీ ?

చంద్రగిరి, జనవరి 27: కొటాల పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో లేరని మాజీ సర్పంచ్ మదన్‌మోహన్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో నారావారిపల్లెలో ఉన్న ఆసుపత్రి సామాజిక ఆరోగ్యం కేంద్రంగా మారడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కొటాలకు మార్చి ఇద్దరు వైద్యులను కేటాయించారని, అయినా వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండడంలేదన్నారు. జిల్లా వైద్య ఉన్నతాధికారులు స్పందించి కొటాలలో పీహెచ్‌సీకి నూతన భవనం నిర్మించి వైద్యులను అందుబాటులో తీసుకురావాలని కోరారు.

బ్యూటీ పార్లర్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి, జనవరి 27: చంద్రగిరి ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఫిబ్రవరి 1 నుంచి 30 రోజులపాటు మహిళలకు బ్యూటీ పార్లర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 40 ఏళ్లలోపు నిరుద్యోగ మహిళలు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 630171672 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

చిన్నగొట్టిగల్లు మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యుగంధర్‌రెడ్డి

భాకరాపేట, జనవరి 27: తుడా నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండల సమావేశం శనివారం స్త్రీ శక్తి భవనంలో జరిగింది. అధికారులు తమ శాఖలలో అభివృద్ధి పనుల గురించి వివరించారు. మండలానికి 1156 ఇళ్లు మంజూరు కాగా 827 ఇళ్ళు పూర్తి చేశారని హౌసింగ్ అధికారి వరముని తెలిపారు. ఎన్‌పీఐ పథకం ద్వారా 362 ఇళ్ళు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి తెలిపారు. జొన్న, మొక్కజొన్న విత్తనాలు రాయితీతో ఇస్తున్నట్లు పశువైద్యాధికారి తెలిపారు. కొత్త పంపుసెట్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.2 కోట్లు మంజూరైనట్లు ఏఈ సిద్దారెడ్డి పేర్కొన్నారు. ఆర్డీఎస్ పథకం ద్వారా గ్రామాలోల త్రీఫేస్ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ ప్రదీప్ తెలిపారు. క్రిమిసంహారక మందులు కావాల్సిన రైతులు ముందస్తుగా ఆర్‌బీకేలో నగదు చెల్లిస్తే అవసరమైన మందులు తెప్పిస్తారని వ్యవసాయ అధికారి ధనలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ స్వరూప, ఎంపీడీవో దేవేంద్రబాబు, తహసీల్దార్ లోకేశ్వరి, ఈవోఆర్డీ సోమశేఖర్‌రెడ్డి, అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ



నానీతో కలిసి ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

భాకరాపేట, జనవరి 27: పొలం తగాదాతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. చిన్నగొట్టిగల్లు మండలం, జంగావాండ్లపల్లె పంచాయతీ, చినిగేపల్లెకు చెందిన బంట్రేడ్డి సుధాకర్‌రెడ్డికి, అదేగ్రామానికి చెందిన పక్క పొలందారుడు హరినాథ్‌రెడ్డికి భూ తగాదాలున్నాయి. ఆరునెలల క్రితం హరినాథ్‌రెడ్డి సర్వేయర్‌తో పొలం సర్వే చేయించాడు. ఆ సర్వేయర్‌పై తమకు నమ్మకం లేదని బంట్రేడ్డి సుధాకర్‌రెడ్డి జిల్లా సర్వేయర్ ద్వారా సర్వే చేయించాలని ప్రయత్నిస్తుండగా శనివారం హరినాథ్‌రెడ్డి ఎక్స్‌కవేటర్‌తో భూమిని చదును చేస్తుండగా, సుధాకర్‌రెడ్డి, అన్న ప్రతాప్‌రెడ్డిలు అడ్డుకున్నారు. దీంతో హరినాథ్‌రెడ్డి, తన అనుచరులైన గువ్వల మునిచంద్రారెడ్డి, మరి కొంతమందితో కలిసి సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డిలపై దాడి చేశారు. సుధాకర్‌రెడ్డి టీడీపీ సానుభూతి పరుడు కావడంతో సమాచారం అందుకున్న టీడీపీ నేత పులివర్తి నాని బాధితులతో కలిసి భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శ్రీవారిమెట్టు మార్గంలో పోటెత్తిన భక్తులు



శ్రీవారిమెట్టు మార్గంలో పోటెత్తిన భక్తులు

చంద్రగిరి, జనవరి 27: శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమల శ్రీవారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజులపాటు సెలవులు కావడంతో తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. శ్రీవారిమెట్టు మార్గంలో ప్రతి రోజూ సుమారు 5 వేల సర్వదర్శనం టోకెన్లు జారీ చేస్తున్నారని, తిరుమలలో రద్దీ కారణంగా టోకెన్లు కుదించారని భక్తులు వాపోతున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు పదివేల మంది భక్తులు తిరుమలకు కాలినడకన వెళ్లారు.

జయహో బీసీ సభకు తరలిరండి

రామచంద్రాపురం, జనవరి 27: ఆర్సీపురం మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే జయహో బీసీ సభకు వేలాదిగా తరలిరావాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు సభను విజయవంతం చేయాలని కోరారు.

పుస్తకాలు చదివించడం కోసమే ప్రదర్శన



తిరుపతి (కల్చరల్), జనవరి 27: బడి పిల్లలకు, యువతరానికి పుస్తకాలను చదివే అలవాటు చేయడం కోసమే ఏటా పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు భారతీయ విద్యాభవన్ సంచాలకులు డాక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు అన్నారు. భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 16వ వార్షిక పుస్తక ప్రదర్శనలో శనివారం అరబిందో వేదికపై నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ అరబిందోకు భారతీయ విద్యాభవన్‌తో మంచి అనుబంధం ఉందన్నారు. ఆయన స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర వహించారని తెలిపారు. ఆయనపై భారతీయ విద్యాభవన్ ఒక పుస్తకం కూడా ప్రచురించినట్లు చెప్పారు. ఆ పుస్తకానికి భవన్ వ్యవస్థాపకులు కె.ఎం.మున్షీ ముందుమాట రాశారని గుర్తు చేశారు. విశిష్ట అతిథి, ఐఐటీ ఆచార్యులు ఎ.రఘురామరాజు మాట్లాడుతూ పుస్తకాన్ని ఎలా చదవాలో విద్యార్థులకు వివరించారు. మరో అతిథి, తిరుపతి అరబిందో సొసైటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ అరబిందో మహాసాగరం వంటి వాడన్నారు. అనేక ఉదాహరణలతో ఆయన స్ఫూర్తిని సభకు పరిచయం చేశారు.

నేడు ముగింపు

16వ తిరుపతి పుస్తక ప్రదర్శన ఆదివారంతో ముగుస్తుంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుంది. సాయంత్రం 6 గంటలకు జరిగే ముగింపు సభలో ముఖ్య అతిథులుగా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతులు ఆచార్య భారతి, ఆచార్య శ్రీకాంత్ రెడ్డి, ఐఐటీ తిరుపతి సంచాలకులు ఆచార్య కె.ఎన్.సత్యనారాయణ పాల్గొంటారు.

ఘనంగా పశువుల పండుగ



కావలివారిపల్లెలో పరుగులు తీస్తున్న కోడెగిత్త

పాకాల, జనవరి 27: మండలంలోని కావలివారిపల్లెలో శనివారం పశువుల పండుగ ఘనంగా నిర్వహించారు. పశువుల కొమ్ములకు రంగులు దిద్ది రాజకీయ నాయకుల పలకలు కట్టి పూజలు నిర్వహించారు. అందంగా ముస్తాబు చేసిన కోడె గిత్తలను వీధిలో పరుగెత్తించారు. పశువుల కొమ్ములకు కట్టిన పలకలను చేజిక్కించుకోవడానికి యువత ఉత్సాహం పాల్గొన్నారు. పశువుల పండుగ తిలకించడానికి పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో కావలివారిపల్లె జనసంద్రమైంది. టీడీపీ ఇన్‌చార్జ్ పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

పాకాల: పాకాలలో శనివారం మండల ప్రైవేట్ ఎలక్ట్రికల్ వైర్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్స్ డే ఘనంగా జరుపుకొన్నారు.ముందుగా ర్యాలీ నిర్వహించారు.అనంతరం అసోసియేషన్ నాయకులు ఆర్టీసీ బస్టాండు సమీపంలో సమావేశమై మాట్లాడుతూ కార్మికుల హక్కులను రక్షించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సబాస్టియన్ (తంబీ), ఉపాధ్యక్షుడు మునికృష్ణ, కార్యదర్శి వెంకటేష్, ట్రెజరర్ బాలాజీ, షబ్బీర్, లోకాసింగ్, బాబు, భాస్కర్ నాయుడు, శంకర్, పురుషోత్తం రెడ్డి, వెంకట్రామరెడ్డి పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయం ముందు నిర్మాణాలొద్దు



ఆలయం ముందు నిర్మాణాలు

చంద్రగిరి, జనవరి 27: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ముందు సెల్‌ఫోన్, పాదరక్షల కౌంటర్ల కోసం నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే ఆలయం ముందు భాగంలో కాకుండా వెనుక భాగంలో చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆలయం ముందు శాశ్వత నిర్మాణాలు చేపడితే ఆలయ ముఖచిత్రం మారిపోతుందని, ఉత్సవాలు నిర్వహించడానికి ఇబ్బందులు ఉంటాయని భక్తులు వాపోతున్నారు. ఆలయ ముందు భాగంలో భక్తులు సేద తీరడానికి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు చేయాలన్నా అనువుగా ఉంటుంది. టీటీడీ ఉన్నతాధికారులు స్పందించి ఆలయం ముందు నిర్మించే సెల్‌ఫోన్, పాదరక్షల కౌంటర్ల నిర్మాణాలు నిలుపుదల చేసి, ఆలయ వెనుక భాగంలో నిర్మించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు

తిరుచానూరు, జనవరి 27: బ్రాహ్మణపట్టు గ్రామానికి చెందిన మణికంఠ తన ఇంటి వద్ద మద్యం విక్రయిస్తుండగా పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడి నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తిరుచానూరు సీఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

16న సప్తవాహనాలపై ఊరేగనున్న అమ్మవారు

తిరుచానూరు, జనవరి 27: రథసప్తమి పర్వదినం సందర్భంగా వచ్చే నెల 16న తిరుచానూరు పద్మావతి అమ్మవారు ఏడు వాహనాలపై ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. ఉదయం 7.15 నుంచి 8.15గంటల వరకు సూర్యప్రభ వాహనం, ఉదయం 8.45నుంచి 9.45 గంటల వరకు హంసవాహనం, ఉదయం 10.15 ననుంచి 11.15 గంటల వరకు అశ్వవాహనం, ఉదయం 11.45నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు గరుడ వాహనంపై విహరించి భక్తులను కటాక్షించ నున్నారు. మధ్యాహ్నం 1.15 నుంచి 2.15గంటల వరకు చిన్న శేషవాహనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7గంటల వరకు చంద్రప్రభ వాహనం, రాత్రి 8.30 నుంచి 9.30గంటల వరకు గజ వాహనంపై దర్శనమిస్తారు. కాగా సాయంత్రం 3.30 నుంచి 4.30గంటల వరకు పద్మావతి అమవారి ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమం జనం వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో నిర్వహించే లక్ష్మీపూజ, ఆర్జిత కల్యాణోత్సవం, కుంకుమార్చన, బ్రేక్ దర్శనం, ఊంజలసేవ, సహస్ర దీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది. తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం పక్కన గల సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉదయం 6 నుంచి 7గంటల వరకు స్వామివారు అశ్వ వాహనం అధిష్టించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. 13న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు.

స్విమ్స్ పరిశోధక విద్యార్థినికి డాక్టరేట్



శాముండేశ్వరి

తిరుపతి సిటీ, జనవరి 27 : స్విమ్స్ యూనివర్సిటీలో బయో టెక్నాలజీ విభాగంలో పరిశోధనలు చేసిన విద్యార్థిని శాముండేశ్వరికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) పట్టాను ప్రదానం చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బయోటెక్నాలజీ విభాగం ఛీఫ్ గైడ్ ప్రొఫెసర్ డాక్టర్ పీ.వీ.జీ.కే శర్మ పర్యవేక్షణలో అలైడ్ హెల్త్ సైన్సెస్ విభాగం కింద బయోటెక్నాలజీలో ఇన్ విట్రో జనరేషన్ ఆఫ్ కొండ్రోసైట్స్ ఫ్రమ్ హ్యూమన్ హెమటోపోయిటిక్ స్టెమ్‌సెల్స్ అనే అంశంపై పరిశోధనలు చేసిన గ్రంథాన్ని యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ వారు పరిశీలించి పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వనజాక్షమ్మ అధికారికంగా ప్రకటించారు. శాముండేశ్వరిని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, డీన్ అల్లాడి మోహన్, ఆర్ఎంవో కోటిరెడ్డి అభినందించారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు మంగళం విద్యార్థిని



ప్రత్యూషను అభినందిస్తున్న కేశవులునాయుడు

తిరుపతి (రవాణా), జనవరి 27: గత నెల రైల్వే కోడూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-19 బేస్‌బాల్ పోటీల్లో తిరుపతి అర్బన్ మండలం పరిధిలోని మంగళం బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రత్యూష ప్రతిభ కనబరచి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కేశవులునాయుడు, పీడీలు రామకృష్ణ, సాంబశివరావు తెలిపారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు ఛతీస్‌గఢ్‌లోని కోర్బాలో జరిగే బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ రామానాయుడు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 27: భూ కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని హ్యూమన్‌రైట్స్ సభ్యుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రేణిగుంట మండలం మర్రిగుంట దళితవాడ సర్వే నెంబరు 12/2లోని 1.90సెంట్ల డీకేటీ భూమిని అదే గ్రామానికి చెందిన కృష్ణయ్య పేరుపై 1977వ సంవత్సరంలో డిపట్టా మంజూరు చేసినట్లు చెప్పారు. మూడు నెలలుగా రేణిగుంటకు చెందిన మురళీమోహన్ దౌర్జన్యంగా ఆ భూమిలో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన తమపై దాడులకు పాల్పడ్డారని తెలిపారు. గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, న్యాయం చేయాలని కోరారు. కాగా, మర్రిగుంట గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ హ్యూమన్‌రైట్స్ పేరు చెప్పుకుని డబ్బులు లేదా ప్లాట్స్ ఇవ్వాలని బెదిరిస్తున్నారని మురళీమోహన్ ఆరోపించారు. ఆ భూమిని వినాయక మొదలియార్ నుంచి తాను కొనుగోలు చేశానని అన్నారు. దీనిపై 2012లోనే ఇంజక్షన్ ఆర్డరు ఉందని, 2003లో హైకోర్టు తీర్పు ప్రకారం మిగిలిన ఖాళీ భూమిని కొనుగోలు చేశామని అన్నారు. రాజ్‌కుమార్‌పై గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపారు.




తిరుమల ఆలయం ముందు జస్టిస్ లలిత - సిద్దార్థ్ లూథ్రా

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లలిత, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడ్డ ప్రశాంతి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27 : ఇంటర్ విద్యార్థిని హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం ఉదయం తిరుపతిలో చోటుచేసుకుంది. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... చంద్రగిరి మండలం అరిగిలవారిపల్లెకు చెందిన ఎస్.నాగరాజు, జయంతి కుమార్తె ఎస్.ప్రశాంతి (17) తిరుపతి డీబీఆర్ ఆస్పత్రి సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతూ కళాశాల వసతి గృహంలో ఉంటోంది. శనివారం ఉదయం అల్పాహారం తీసుకునేందుకు తోటి విద్యార్థినులతో కలిసి వెళ్లిన ప్రశాంతి వెంటనే తన గదికి తిరిగి వచ్చి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన తోటి విద్యార్థినులు కళాశాల సిబ్బందికి తెలియజేశారు. ఆమెను హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు రుయా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న ఈస్ట్ ఎస్ఐ పురుషోత్తంరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ సూసైడ్ నోట్‌ను గుర్తించారు. ప్రేమ విషయంలో మోసపోవడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్టు సీఐ చెప్పారు. కేసు నమోదు చేసిన ఈస్ట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం

తిరుమల, జనవరి27(ఆంధ్రజ్యోతి) : టీటీడీ శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్(ఎస్వీబీసీ) ట్రస్టుకు శనివారం రూ.20 లక్షలు విరాళంగా అందింది. అమెరికాలో నివాసముంటున్న ఎన్ఆర్ఐ భక్తుడు చంద్రశేఖర్ ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షలు అందజేశారు. తమ ప్రతినిధి తిరుపతికి చెందిన రాఘవేంద్రతో కలిసి తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ధర్మారెడ్డికి చెక్‌ను అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన సుధాకర్, కృష్ణారావు, లక్ష్మీభాయ్ కూడా ఎస్వీబీసీ ట్రస్టుకు మరో రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. విరాళం చెక్‌ను తిరుమలలో ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

బ్రాహ్మణ సమాజ సందర్శన

తిరుపతి(కల్చరల్), జనవరి27: తిరుపతిలోని బ్రాహ్మణ సమాజ కార్యాలయాన్ని చిత్తూరు, తిరుపతి జిల్లాల గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు వేదం హరిప్రసాద్ శనివారం సందర్శించారు. కార్పొరేషన్ నిధుల వినియోగంపై చర్చించారు. రాష్ట్రబ్రాహ్మణ కార్పొరేషన్ అధ్యక్షుడు పేరి కామేశ్వరరావు, కోశాధికారి ప్రభాకర్, చక్రవర్తిరాఘవన్, భీమాస్ అశోక్, సింహాచారి, మూవీ రామశర్మ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రేపటి వరకు ఇంటర్ తత్కాల్ ఫీజు గడువు

తిరుపతి(విద్య), జనవరి 27: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన తత్కాల్ స్కీమ్ ఫీజు గడువు ఈ నెల 29వ తేదీతో ముగుస్తుందని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జనరల్, ఒకేషనల్ విభాగంలో ఇంటర్మీడియట్ కోర్సులు చదివే రెగ్యులర్, అనుత్తీర్ణులైన విద్యార్థులు రూ.3వేల అపరాధ రుసుంతో ఈ నెల 29న సాయంత్రం 5గంటల్లోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించే వెసులుబాటు ఉందని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

30న ఐటీఐలో జాబ్‌మేళా

తిరుపతి(విద్య), జనవరి 27: పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సబ్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఈనెల 30న మంగళవారం ఉదయం 10గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి ఎస్.వెంకటరమణ పేర్కొన్నారు. అపోలో ఫార్మసిలో రిటైల్ ట్రైనీ అసోసియేట్/ఫార్మాసిస్ట్ పోస్టులకు టెన్త్, ఇంటర్, ఏదేని డిగ్రీ, ఎం.ఫార్మసి, బి.ఫార్మసి, డి.ఫార్మసి విద్యార్హత ఉండి 18-30సంవత్సరాల వయస్సు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.13,500-20వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు సర్టిఫికెట్స్‌తో హాజరుకావచ్చని తెలిపారు.

కృత్రిమ తీపి పదార్థాలతో క్యాన్సర్ ప్రమాదం

● డాక్టర్ కృష్ణప్రశాంతి



అవార్డును చూపుతున్న డాక్టర్ కృష్ణప్రశాంతి

తిరుపతి సిటీ, జనవరి 27 : కృత్రిమ తీపి పదార్థాల(ఆర్టిఫిషియల్ స్వీట్నర్)ను అధికంగా వాడటం వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని ప్రముఖ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ పెన్నా కృష్ణప్రశాంతి పేర్కొన్నారు. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో మూడు రోజులుగా జరుగుతున్న 24వ ప్రపంచ కాంగ్రెస్ ఆఫ్ డయాబెటిస్ ఇండియా కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. ఆర్టిఫిషియల్ స్వీట్నర్ వాడకం, షుగర్ వ్యాధి ఉన్న ఆడపిల్లలు, మహిళల గురించి ప్రసంగించారు. కృత్రిమ తీపి పదార్థాలు వడటం వల్ల షుగర్ తగ్గకపోవడం, ఊబకాయం రావడం, గర్భధారణ సమయంలో నెలలు నిండక కాన్పులు జరగడం, మూర్ఛవ్యాధి ఉన్న వారిలో ఫిట్స్ రావడం, మైగ్రేన్ తలనొప్పి ఉన్న వారిలో తీవ్రత ఎక్కువ కావడం జరుగుతుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం గర్భిణులు, బాలింతలు, రెండేళ్ల లోపు పిల్లలు ఆర్టిఫిషియల్ స్వీట్నర్ వాడటం నిషేధించిందన్నారు. అనంతరం ఆమెకు ఫెలోషిప్ ఆఫ్ డయాబెటిస్ ఇండియా అవార్డును ప్రదానం చేశారు. ఆమెను మెంబర్ ఆఫ్ డయాబెటిస్ ఉమెన్ ఇంట్రెస్ట్ గ్రూప్ ఆఫ్ డయాబెటిస్ ఇండియాగా ఎంపిక చేసి, జాతీయ స్థాయిలో ప్రముఖులతో కలిసి డయాబెటిస్ మహిళల సమస్యలు అధ్యయనం చేసే గ్రూప్‌లో సభ్యులుగా నియమించారు.

అరవింద్ కంటి ఆస్పత్రికి అరబిందో ఫార్మా విరాళం

తిరుపతి సిటీ, జనవరి 27 : జూపార్కు రోడ్డులో గోవెల్ ట్రస్టు ద్వారా నడుస్తున్న ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారు రూ.25 లక్షల విలువైన రవాణా వాహనాన్ని విరాళంగా అందించారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానంద రెడ్డి చేతుల మీదుగా శనివారం ఆస్పత్రి జనరల్ మేనేజరు కేశవకుమార్‌కు ఈ వాహనాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో ఈ వాహనాన్ని అందిస్తున్నామన్నారు. ఆస్పత్రి జీఎం కేశవ కుమార్ మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికే అనేక ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించి, కంటి సమస్యలున్న వారిని గుర్తించామన్నారు. ఇలాంటి రోగులను ఉచితంగా తీసుకువచ్చేందుకు ఈ వాహనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆస్పత్రి సిబ్బంది డాక్టర్ శ్రీనాథ్, వాసుదేవరెడ్డి, అరబిందో ఫార్మా ఫౌండేషన్ సిబ్బంది చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగం చేయొద్దన్నందుకు వివాహిత ఆత్మహత్య



జ్యోతిక మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27 : ఉద్యోగం చేయొద్దన్నందుకు ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం తిరుపతిలో చోటుచేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ పురుషోత్తంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... తిరుపతి అశోక్‌నగర్‌కు చెందిన ధనరాజ్ సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు కర్ణాటక రాష్ట్రం గంగావతికి చెందిన జ్యోతిక (23)తో సంవత్సరం క్రితం వివాహమైంది. బీటెక్ చదివిన జ్యోతికకు ఉద్యోగం చేయడమంటే ఇష్టం. తాను కూడా ఉద్యోగం చేస్తానని నిత్యం అడుగుతుండేది. ఆ ప్రతిపాదనను భర్త తిరస్కరించేవాడు. ఇదే విషయమై శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్తాపం చెందిన జ్యోతిక భర్త స్నానం చేసి వచ్చే లోపల గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

● డీటీవో ఆదినారాయణ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీటీవో ఆదినారాయణ, సునీల్‌చక్రవర్తి

తిరుపతి (రవాణా), జనవరి 27 : రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తిరుపతి జిల్లా ఇన్‌చార్జి రవాణా శాఖ అధికారి ఆదినారాయణ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ బైక్ ర్యాలీని నిర్వహించారు. డీటీవో మాట్లాడుతూ బైక్ నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అధిక వేగం వంటివి చేయకూడదని సూచించారు. రాష్ట్ర రవాణా శాఖ సభ్యులు సునీల్ చక్రవర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు కొనిచ్చే సమయంలో తగు జాగ్రత్తలు తెలపాలన్నారు. ఈ ర్యాలీ మంగళంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయం నుంచి లీలామహల్ వరకు అక్కడి నుంచి తిరిగి కార్యాలయం వరకు కొనసాగింది. ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, కుసుమ, స్వర్ణలత, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు పట్టిస్తే కేసులా..!

● న్యాయ పోరాటం చేస్తాం : టీడీపీ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 27: నగరపాలక సంస్థ ఎన్నికల్లో దొంగ ఓట్లను పట్టిస్తే న్యాయం చేస్తామని చెప్పిన అప్పటి అధికారులు పట్టించిన వారిపైనే కేసులు నమోదు చేయిస్తున్నారని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల్లో దొంగ ఓట్ల ప్రక్రియపై మీడియాలో సాక్ష్యాధారాలతో చూపించినా అప్పటి రెవెన్యూ, పోలీసు, నగరపాలకసంస్థ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. రెండు డివిజన్‌లో జరిగిన ఎన్నికల్లో ఒక వ్యక్తి రెండు దొంగ ఓట్లు వేయడంపై బహిరంగంగా పట్టుకుని ఎన్నికల అధికారులకు అప్పగిస్తే న్యాయం చేస్తామని చెప్పి ఇప్పుడు ఒకటో తేదీ కోర్టుకు రావాలని బాధితులపై కేసు నమోదు చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలను అడ్డుకోవాల్సిన అధికారులే పాలకుల అడుగులకు మడుగులు ఒత్తుతూ ఎన్నికల వ్యవస్థను దిగజార్చడం బాధాకరమన్నారు. ఇలాంటి అధికారులపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీధర్‌వర్మ, శాంతి, రామ్, మనోహర్ ఆచారి, యశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్






పీలేరులో జరిగిన రా.. కదలిరా సభలో పాల్గొనేందుకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న తిరుపతి 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ - బహిరంగ సభ వేదికపై చంద్రబాబు నాయుడుతో రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహనరాజు - సభా వేదికపై రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి - చంద్రబాబుతోపాటు బస్సు దిగుతున్న మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాజంపేట పార్లమెంటు టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం అన్యాయం

దీక్షా శిబిరంలో నాయకులు, కార్మికులు



టీటీడీపై అఖిలపక్ష నేతల ఆగ్రహం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 27 : టీటీడీ అటవీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం అన్యాయమని మాజీ ఎంపీ(రాజ్యసభ) పెనుమల్లి మధు ఆక్షేపించారు. 38 నెలలుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులకు న్యాయం జరగడం లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 మంది కార్మికులు నిరవధిక నిరాహార దీక్షకు పూనుకోగా అఖిలపక్ష నేతలు పూలమాలలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. మధు మాట్లాడుతూ ధార్మిక సంస్థ అయిన టీటీడీలో అధర్మం రాజ్యమేలుతోందన్నారు. టీటీడీ ఛైర్మన్‌గా కరుణాకరరెడ్డి ఉండి కార్మికులకు కష్టం కలగడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇటీవల కాలంలో టీటీడీ వివాదాలకు కేంద్రంగా మారిందని, జూనియర్లను పర్మినెంట్ చేసి సీనియర్లను కార్పొరేషన్‌లో బలవంతంగా కలపడం సమంజసమా అని ప్రశ్నించారు. భక్తుల ముందు తలవంపులు తెచ్చుకోకముందే సమస్య పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపాలన్నారు. విశ్రాంత న్యాయమూర్తి పి.గుర్రప్ప మాట్లాడుతూ అటవీ కార్మికుల సమస్యలు న్యాయపరమైనవని, ఏ రోజైనా న్యాయస్థానంలో గెలుపు వారిదే అవుతుందని స్పష్టం చేశారు. రాయలసీమ అధ్యయనాల సంస్థ అధ్యక్షుడు భూమన్ మాట్లాడుతూ అటవీ కార్మికుల పోరాటాలు, విజ్ఞప్తులు పట్టించుకోకపోవడం అమానుషమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి, మాట్లాడుతూ ఉన్నతాధికారులు టీటీడీ పనులకంటే అధికార పార్టీ సేవలో తలమునకలై ఉన్నారని ఆరోపించారు. రిపబ్లికన్ పార్టీ నేత పి.అంజయ్య మాట్లాడుతూ కొండ పచ్చదనానికి కారకులైన అటవీ కార్మికుల పట్ల దుర్మార్గంగా ప్రవర్తించడం తగదన్నారు. జనసేన నేతలు కిరణరాయల్, రాజారెడ్డి మాట్లాడుతూ తక్షణమే కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సీపీఐ(ఎంఎల్)నేత ఆర్.హరికృష్ణ, బీఎస్పీ నేత విజయ్ కుమార్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పలువురు ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు వారికి సంఘీభావం ప్రకటించారు. ఆటో, హమాలీ, బిల్డింగ్, హాకర్స్, రుయా, స్విమ్స్ ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులు, శెట్టిపల్లి భూ బాధితులు, ప్రైవేటు బస్సుల కార్మికులు, అంగన్వాడీలు, మెడికల్ రెప్స్, ఆర్టీసీ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, కల్యాణకట్ట క్షురకులు, టీటీడీ కాంట్రాక్ట్ కార్మికులు మద్దతు పలికారు. సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, టౌన్‌బ్యాంక్ మాజీ ఛైర్మన్ వెంకటకృష్ణ, అర్జున్, జయచంద్ర, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, లక్ష్మీ, మునిరాజ, బుజ్జి, శ్రీనివాసులు, రమేష్, గురవయ్య, నాగరాజు, రఘు, పార్థసారథి, మాధవ్, కృష్ణ, పద్మనాభం, లక్ష్మయ్య, ప్రసాదరావు, వెంకటేష్, పద్మనాభం పాల్గొన్నారు.

శ్రీవారి ఆశీస్సులతో యువగళం విజయవంతం



అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న రవితో యువగళం వలంటీర్లు, తెలుగు యువత

తిరుమల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆశీస్సులతో నారా లోకేశ్ యువగళం పాదయాత్ర విజయవంతమైందని టీడీపీ వలంటీర్ల కోఆర్డినేటర్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు అన్నారు. యువగళం పాదయాత్ర చేపట్టి ఏడాది పూర్తికావడంతో పాటు నారా లోకేశ్, వలంటీర్లు అక్రమ కేసుల నుంచి బయటకు వచ్చిన నేపథ్యంలో రవినాయుడు యువతతో కలిసి శనివారం తిరుమలలోని అఖిలాండం వద్ద 206 కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యువగళం పాదయాత్ర ఒక ప్రభంజనమని, శ్రీవారి ఆశీస్సులు, ప్రజల దీవెనలతో విజయవంతమైందని అన్నారు. సీఎం జగన్ అరాచక పాలనతో విసిగిపోయి కన్నీరు పెడుతున్న ప్రజలకు, యువతకు ధైర్యం చెప్పడానికి, భరోసా ఇవ్వడానికి లోకేశ్ పాదయాత్ర చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. పాదయాత్రను ఎలాగైనా అడ్డుకోవాలని వైసీపీ ప్రభుత్వం జీవో నెంబరు ఒకటి తెచ్చిందన్నారు. అయినప్పటికీ లోకేశ్ ప్రజా ఆశీర్వాదంతో కుప్పంలో పాదయాత్రను ప్రారంభించారన్నారు. మైక్ లాక్కోవడం, వెహికల్‌ను సీజ్ చేయడం వంటి వాటికి పాల్పడ్డారన్నారు. అశేష ప్రజానీకం పాల్గొనడాన్ని చూసిన ప్రభుత్వం కేసులు పెట్టిందన్నారు. లోకేశ్‌కు రక్షణగా ఉన్న తమపై కేసులు పెట్టి జైల్లో పెట్టారన్నారు. ఈక్రమంలో పాదయాత్ర విజయవంతంగా పూర్తయితే తిరుమలకు వచ్చి కొబ్బరికాయలు కొడతామని మొక్కుకున్నామని, అందులో భాగంగానే స్వామికి కొబ్బరికాయలు కొట్టామని అన్నారు. చంద్రబాబు సీఎం కావడం తథ్యమని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా లోకేశ్ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు కరణం సందీప్, శ్రీనివాస్ యాదవ్, దిలీప్ రాయల్, శ్రీరామ్ బాబి, తిరుమల తెలుగు యువత అధ్యక్షుడు రాఘవ, గోపి, జయకృష్ణ, వంశీ, నాగరాజు, యువగళం వలంటీర్లు త్యాగరాజు, మురళి, ఢిల్లీబాబు, పూర్ణ, గజేంద్ర, యల్లప్ప, మునిరాజ, రాజేశ్, ప్రసాద్, లీలా హరి, వెంకీ, నవీన్, ముని ప్రసాద్, మోహన్, రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక జనాభా అభివృద్ధికి అవరోధం

విక్రమసింహపురి వర్సిటీ అధ్యాపకురాలు సునీత



మాట్లాడుతున్న డాక్టర్ సునీత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 27: ప్రపంచంలోని పలు దేశాల్లో అధిక జనాభా అభివృద్ధికి అవరోధంగా మారిందని విక్రమసింహపురి యూనివర్సిటీ సోషియల్ వర్క్ విభాగ అధ్యాపకురాలు సునీత పేర్కొన్నారు. జనాభా విద్య ప్రాముఖ్యత - సమస్యలు అంశంపై ఎస్వీయూ పాపులేషన్ స్టడీస్ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని దేశంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించడం, అమలు చేయడం సాధ్యమవుతుందన్నారు. జనాభా విద్యకు సంబంధించి బోధన, పరిశోధన రంగాల్లో యూనివర్సిటీ పాపులేషన్ స్టడీస్ విభాగం ఎంతో అభివృద్ధి చేసిందన్నారు.

భక్తిని పెంపొందిస్తున్న సినిమా పాటలు

ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ రిజిస్ట్రార్ ప్రతాప్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 27: సినిమా పాటలు మనుషుల్లో భక్తి భావాన్ని పెంచే విధంగా ఉన్నాయని ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలుగు విశ్రాంతాచార్యులు ఉగ్రాణం చంద్రశేఖర్ రెడ్డి రాసిన తెలుగు సినిమా - భక్తి పాటలు పుస్తకాన్ని ఆయన సెనేట్ హాల్లో శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. తెలుగు సినిమా భక్తి పాటల్లో ఎంతో సాహిత్యముందన్నారు. సభాధ్యక్షత వహించిన తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్, ఎస్వీయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జె.ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఎన్నో గ్రంథాలు రాసిన చంద్రశేఖర్‌రెడ్డి మంచి పేరు, గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. రచయిత ఉగ్రాణం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సినిమా పాటలపై మరింత పరిశోధన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అతిథులను ప్రొఫెసర్ పేట శ్రీనివాసులురెడ్డి పరిచయం చేయగా, పుస్తకాన్ని ఆకాశవాణి మాజీ డైరెక్టర్ ఆకుల మల్లేశ్వరరావు సమీక్షించారు. సప్తతి సందర్భంగా ఉగ్రాణం చంద్రశేఖర్‌రెడ్డి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పాలకమండలి సభ్యురాలు భూమన సుగుణారెడ్డి, తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, విశ్రాంతాచార్యులు పి.నరసింహారెడ్డి, కె.మునిరత్నం, అళహరి పాపారావు, ఆదినారాయణరెడ్డి, భూమన జనార్దన్ రెడ్డి, గెస్ట్ ఫ్యాకల్టీ సునీల్ కుమార్, బ్రహ్మానందరెడ్డి, పెంచల్‌ప్రసాద్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనివాస సేతుపై మెర్జింగ్ పనులు



శ్రీనివాస సేతుకు ఎగబడే ర్యాంపు వద్ద జరుగుతున్న పనులు - పై నుంచి కిందికి దిగే ర్యాంపు వద్ద గ్యాప్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 27 : నగరంలో నిర్మించిన శ్రీనివాససేతు మెర్జింగ్ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఈ వంతెనను నిర్మించిన ఆప్కాన్ సంస్థే దాని నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. ఇందులో భాగంగా సెంట్రల్ బస్టేషన్ నుంచి తిరుమల వెళ్లే, వంతెన నుంచి కిందికి దిగే ర్యాంపుల విలీన స్థలంలో వాహనాల ఒత్తిడికి నెర్రలు ఏర్పడ్డాయి. పై నుంచి కింది భాగం కనబడుతుండడంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్న విషయం గుర్తించిన ఆఫ్కాన్ సంస్థ రక్షణ చర్యలు చేపట్టింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ప్రత్యేక యంత్రాలతో సెంట్రింగ్ వంటి పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు ఒకవైపు జరుగుతున్నాయి. వచ్చే వారం మరోవైపు ప్రారంభిస్తారు. ఆ తర్వాత లీలామహల్ రెండో అంతస్తు మలుపు జాయింట్ వద్ద కూడా మెర్జింగ్ పనులు చేయనున్నారు.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఇవ్వండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 27 : కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే వేతనాలు అందించేలా చూడాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. ఎస్వీయూలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కాంట్రాక్టరు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. దీంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నెలకు రూ.9 వేలు వేతనం కూడా పెండింగ్ పెట్టడం విచారకరమని పేర్కొన్నారు. దీనిపై స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని ఎస్వీయూ వీసీని సప్తగిరి ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు.

కోడికత్తి శీను ఆపదలో ఉన్నాడు..

- కాంగ్రెస్ పార్టీని విమర్శించే స్థాయి జగన్‌కు లేదు
- కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న చింతా మోహన్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 27: అమాయకుడు కోడికత్తి శీను ఆపదలో ఉన్నాడని, అతన్ని జైల్లో చంపేసిన ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దళితుల ప్రాణాలను బలిగొంటోందన్నారు. విశాఖపట్నం విమానాశ్రయంలో కోడికత్తి ఘటనపై అక్కడ అధికారులతో తాను మాట్లాడానని, కేంద్ర బలగాలతో గట్టి భద్రత కలిగి ఉండే విమానాశ్రయంలోకి కోడికత్తి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి ఇచ్చిన సలహాతో కోడికత్తి డ్రామా ఆడారని దుయ్యబట్టారు. జగన్ చొక్కాకు అంటుకున్న రక్తం ఎవరిదో ఫోరెన్సిక్ నిపుణులు పరీక్షిస్తే నిజాలు బయటపడతాయన్నారు. ఐదేళ్లుగా ఓ దళితుడిని జైల్లో నిర్బంధించి బెయిల్ రాకుండా వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని నిప్పులు చెరిగారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారుల, న్యాయమూర్తుల తీరును తప్పుపట్టారు. ఈ కేసులో జగన్ కోర్టుకు హాజరుకాకపోవడం అనుమానాలు పెంచుతోందన్నారు. దళితుల ప్రభుత్వం అని చెప్పే వైసీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించిన నిధులను ఎందుకు దారి మళ్లించిందో చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ ఓడిపోయే పరిస్థితిలో ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ పేరు ఎత్తే అర్హత ఆయనకు లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో 120 అసెంబ్లీ, 20 లోక్‌సభ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు యార్లపల్లి గోపి, ప్రభాకర్, భాస్కర్, చంద్రశేఖర్, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



వేడుకల్లో పాల్గొన్న రాయల్ పీపుల్స్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 27: మున్సిపల్ పార్కులో శ్రీకృష్ణదేవరాయల జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అక్కడున్న విగ్రహానికి పూలమాలలు సమర్పించి, పుష్పాలతో అంజలి ఘటించారు. రాయల్ పీపుల్స్ ఫ్రంట్ నాయకులు, పుర ప్రజలు పాల్గొన్నారు. అజయ్ ప్రసన్న రాయల్, వేణు, సుబ్రహ్మణ్యం, రఘు, వెంకటేష్, ఆంజనేయులు, పూర్ణ, కృష్ణమూర్తి, దేవేంద్ర, పవన్, మురళీమోహన్, క్షేత్రపాల్, సావిత్రమ్మ, సుగుణమ్మ, నిర్మలమ్మ, దిలీప్, రమణ, సోము, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

తాజ్, బ్లిస్ హోటల్స్ అధినేతకు జీవిత సాఫల్య పురస్కారం



సూర్యనారాయణ రెడ్డి

తిరుపతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : సౌత్ ఇండియా హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ (సిహ్రా) ప్రతిష్టాత్మకంగా అందజేసే జీవిత సాఫల్య పురస్కారాన్ని తాజ్, బ్లిస్ హోటల్స్ అధినేత మబ్బు సూర్యనారాయణ రెడ్డి ఇటీవల వైజాగ్‌లో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. శనివారం తాజ్ హోటల్లో 'నేను నాజీవన ప్రస్థానం' పేరిట ఆయన జీవన విశేషాలను మీడియాతో పంచుకున్నారు. కష్టమర్లను దేవుళ్లుగా భావిస్తానని, ఇదే తన విజయ రహస్యమని చెప్పుకొచ్చారు. భార్య మబ్బు రాజ్యలక్ష్మి, కుమారులు రాజశేఖర్ రెడ్డి, బాలకృష్ణా రెడ్డి ఇచ్చిన మనోధైర్యంతో ముందుకు పోగలుగుతున్నానని చెప్పారు. ఓ వైపు బిజినెస్‌మెన్‌గా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ విరివిగా పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పరిచయకర్తగా అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎన్ రెడ్డి వ్యవహరించారు.

బీసీల ఐక్యతను దెబ్బతీసే కుట్ర : టీడీపీ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 27 : తెలుగుదేశం పార్టీలో బీసీల ఐక్యతను దెబ్బతీసేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని టీడీపీ బీసీ సెల్ సాధికార కమిటీ నాయకులు ఆరోపించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో బీసీసెల్ నాయకులు జగన్నాథం, ఆనంద్‌యాదవ్, పెరుమాళ్ మధు మాట్లాడుతూ శుక్రవారం టీడీపీలోని 28 బీసీ కులాలకు సంబంధించిన వ్యక్తులు నిధులు, అభివృద్ధి గురించి సమావేశం ఏర్పాటు చేసుకుంటే దాన్ని వక్రీకరించడం బాధాకరమన్నారు. బీసీలకు వెన్నుదన్నుగా నిలిచే ఏకైక పార్టీ తెలుగుదేశం అన్నారు. ఆదివారం నగర పరిధిలోని హోటల్‌లో నిర్వహించే జయహో బీసీ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరాములు, జయకుమార్, శంకర్‌యాదవ్, కృష్ణయాదవ్, జ్యోతి, అర్జున్‌యాదవ్ పాల్గొన్నారు.

టీడీపీ శాలివాహన కమిటీ నియామకం



కమిటీని ప్రకటిస్తున్న సుగుణమ్మ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 27: టీడీపీ తిరుపతి నియోజకవర్గ శాలివాహన కమిటీని ఇన్‌ఛార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో శనివారం నియమించారు. ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. శాలివాహన విభాగం తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆముదాల తులసీదాస్ మాటాడుతూ తిరుపతి నియోజకవర్గంలో 17మందితో కూడిన కమిటీలో అధ్యక్షుడిగా రెడ్డెప్ప, కార్యదర్శిగా నిరంజన్ పేర్లు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న టీడీపీ శాలివాహన కమిటీలు చురుగ్గా పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

16న రథసప్తమి

ఒకేరోజు ఏడు వాహనాలపై శ్రీవారి దర్శనం

తిరుమల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సూర్యజయంతి సందర్భంగా వచ్చే నెల 16న తిరుమలలో రథసప్తమి జరుగనుంది. ఒకేరోజు శ్రీవారు ఏడు వాహనాలపై కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వనున్నారు. వేకువజాము సూర్యప్రభ వాహనంతో రథసప్తమి వేడుకలు మొదలవుతాయి. తర్వాత చిన్నశేషవాహనం, గరుడవాహనం, హనుమంతవాహనం, చక్రస్నానం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంతో వేడుకలు ముగుస్తాయి. అలాగే ఫిబ్రవరి నెలలో 9వ తేదీన పురందరదాసుల ఆరాధనోత్సవం, 10న తిరుకచ్చినంబి ఉత్సవారంభం, 14న వసంతపంచమి, 19న తిరుకచ్చినంబి శాత్తుమొర, 20న భీష్మ ఏకాదశి, 21న కులశేఖరాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 24న కుమారధార తీర్థ ముక్కోటి, మాఘ పౌర్ణమి గరుడసేవ ఉత్సవాలు జరుగనున్నాయి.

మీడియా రంగంలో రాణిస్తున్న మహిళలు



మాట్లాడుతున్న వైష్ణ రాయ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 27: ప్రస్తుతం మీడియా రంగంలో మహిళలు కూడా బాగా రాణిస్తున్నారని ఫ్రంట్ లైన్ ఎడిటర్ వైష్ణరాయ్ పేర్కొన్నారు. పద్మావతి యూనివర్సిటీ ఇంగ్లిషు విభాగంలో శనివారం ఆమె ధర్మనిధి ఉపన్యాసం ఇచ్చారు. చాలా కాలంగా మీడియా రంగంలో మహిళలు రాణిస్తుండటం కనిపిస్తోందన్నారు. సమాజంలో మీడియా రంగానికి చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. అయితే, కొన్ని లోపాలు ఉన్న మాట వాస్తవమేనని చెప్పారు. రాజకీయ ప్రభావమే ఇందుకు ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో మీడియా రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కోరారు. మీడియా రంగాన్ని సత్య ప్రకటన వైపు తీసుకెళ్లే బాధ్యత యువతరానిదేనని గుర్తు చేశారు. అనంతరం ఆమెను నిర్వాహకులు సన్మానించారు.

వెంగమాంబ జీవితం స్ఫూర్తిదాయకం

పద్మావతి వర్సిటీ వీసీ భారతి



అతిథులను సన్మానిస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 27: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవితం ఈ తరం మహిళలకు స్ఫూర్తిదాయకని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి పేర్కొన్నారు. శ్రీసిటీ సహకారంతో పద్మావతి వర్సిటీలో శనివారం నిర్వహించిన వెంగమాంబకు స్వరాంజలి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రపంచీకరణ నేపథ్యంలో పతనమైన మానవ విలువల పునరుద్ధరణకు వెంగమాంబ సాహిత్యం దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతోనే వెంగమాంబ ఇంతటి కృషి చేయగలిగిందని అన్నారు. ద్రవిడ వర్సిటీ వీసీ మధుజ్యోతి మాట్లాడుతూ వెంగమాంబ జీవిత చరిత్రలోని ముఖ్య ఘట్టాలు, కళాత్మక భావాలు, భక్తి ప్రగాఢమైన సమ్మేళనాన్ని వివరించారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ మాట్లాడుతూ శ్రీవారి పట్ల ఎంతో భక్తి భావం గల వెంగమాంబ చరిత్రను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. మాజీ వీసీ కుసుమకుమారి మాట్లాడుతూ వెంగమాంబ రచనలు సరళత, స్పష్టత, ప్రగాఢ భక్తితో ధ్వనిస్తాయన్నారు. ఎస్వీబీసీ ఛైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ తెలుగు సాహిత్య చరిత్రలో వెంగమాంబకు గొప్ప స్థానం ఉందన్నారు. పరిశోధకుడు గంధం శంకర్‌రావు మాట్లాడుతూ వెంగమాంబ సాహిత్యంలో భక్తికి సంబంధించిన అంశాలు ఉన్నాయన్నారు. వెంగమాంబ కీర్తనలను గాయకులు అనూష, సుష్మ, పవిత్ర, శ్రావణ్, నరేష్ ఆలపించారు. రచయిత స.వెం.రమేష్, తెలుగు అధ్యాపకులు సుభాషిణి, యువశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వెటర్నరీ వర్సిటీ ప్రొఫెసర్‌కు అవార్డు



ఫెలో అవార్డు అందుకుంటున్న సూర్యనారాయణ

తిరుపతి(విద్య), జనవరి 27 : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని వెటర్నరీ కళాశాలలో లైవ్‌స్టాక్ ఫామ్ కాంప్లెక్స్ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీఏఎన్ సూర్యనారాయణకు యానిమల్ న్యూట్రిషన్ సొసైటీ ఆఫ్ ఇండియా(ఏఎన్ఎస్ఐ) ఫెలో అవార్డు లభించింది. చెన్నైలోని తనువాస్ వెటర్నరీ వర్సిటీలో ఏఎన్ఎస్ఐ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి పశుపోషణ సదస్సుల్లో ఆ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సెల్వకుమార్, నాగపూర్ వెటర్నరీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్వీ పాటిల్, భారత ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ కమిషనర్ అభిజిత్‌మిత్ర, ఏఎన్ఎస్ఐ అధ్యక్షుడు డాక్టర్ ఉదయ్‌బీర్ సెహ్వాల్, కార్యదర్శి డాక్టర్ ఏపీఎస్ సేథి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు ప్రకటించారు. యానిమల్ న్యూట్రిషన్‌లో జాతీయ స్థాయిలో పరిశోధన, విస్తరణ, టీచింగ్ విభాగాల్లో చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందించారని పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్స్‌కి 1,168మంది హాజరు

తిరుపతి(విద్య), జనవరి 27: జాతీయ స్థాయిలో ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐటీలలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలకు రెండవ రోజు శనివారం జిల్లాలో 1,168మంది విద్యార్థులు హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ టి.కైలాష్ పేర్కొన్నారు. జిల్లాలోని మూడు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరిగిన ఈ పరీక్షలకు 1,177మందికి గాను 1,168మంది విద్యార్థులు హాజరవ్వగా.. 9మంది గైర్హాజరైనట్లు వివరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.37 కోట్లు

తిరుమల, జనవరి27(ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.37 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 71,664 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 33,330 మంది తలనీలాలు సమర్పించారు.

వైసీపీ అరాచకాలను అంతం చేద్దాం : జనసేన



ఇంటింటి ప్రచారం చేస్తున్న కవిత

తొట్టంబేడు, జనవరి 27: ప్రజలంతా కలిసి వైసీపీ అరాచకాలను అంతం చేద్దామని శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ ఇన్ చార్జి కోట వినుత పిలుపునిచ్చారు. మండలంలోని చిన్న కనపర్తి గ్రామంలో జనసేన 'విజయ యాత్ర.. ఏపీ నీడ్స్ పవన్' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి పేట చంద్రశేఖర్ నాయకులు కావలి శివకుమార్, గణేష్, రవికుమార్‌రెడ్డి, లక్ష్మి, కవిత, నాథ ముని, శారద రాజ్యలక్ష్మి, దినేష్, సురేష్, రాజేష్, కిషోర్ జనసైనికులు పాల్గొన్నారు.

మంచి ఆహారం, వసతులు కల్పించండి

కేవీబీపురం, జనవరి27: వసతి గృహం విద్యార్థులకు మంచి ఆహారంతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని బీజేపీ నాయకులు కోరారు. శనివారం మండలంలోని కోవనూరు బాలుర వసతి గృహాన్ని బీజేపీ మండల నాయకుడు మునిశేఖర్ అధ్వర్యంలో జిల్లా నాయకుల సందర్శించారు. భోజన నాణ్యతను పరిశీలించారు. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడాన్ని, పలు లైట్లు వెలగక పోవడాన్ని గుర్తించారు. ఈ సమస్యలు పరిష్కరించాలని వార్డెన్ సదాశివయ్యను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిల్ మెంబరు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, జిల్లా కార్యదర్శి సత్య నారాయణరెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మునిక్రిష్ణయ్య, ప్రతాప్, ఆనంద్, వెంకటకృష్ణ, వెంకటముని, మునిసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పార్టీ వైపు ప్రజలు చూపు



రామచంద్ర యాదవ్‌ను సత్కరిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 27: రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ కోసం ప్రజలు చూస్తున్నారని బీసీవై పార్టీ అధినేత రామ చంద్ర యాదవ్ అన్నారు. శ్రీకాళహస్తిలోని వేణు గోపాల స్వామి ఆలయాన్ని ఆయన శనివారం దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీసీవై పార్టీ కీలకంగా మారుతుందన్నారు. అన్ని అసెంబ్లీ స్థానాలకూ తమ అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలో తమ పార్టీ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి



అవగాహన ర్యాలీలో ఎంవీఐ దామోదర్‌నాయుడు

శ్రీకాళహస్తి, జనవరి 27: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని శ్రీకాళహస్తి మోటార్ వాహనాల తనిఖీ అధికారి దామోదర్ నాయుడు అన్నారు. పట్టణంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి శనివారం రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదం కారణంగానే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చని వివరించారు. కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటు బెల్ట్, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం పట్టణంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

ఈ-పంట నమోదు తనిఖీ

వరదయ్యపాళెం, జనవరి 27: సంతవేలూరు, సీఎల్ఎన్‌పల్లి, కళత్తూరు గ్రామాల్లో వ్యవసాయ సంచాలకులు ఏడీఏ సుబ్రహ్మణ్యం పర్యటించారు. ఈ-పంటలో నమోదు చేసిన వివరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుహర్‌లత, విస్తరణ అధికారి ప్రవీణ్, వ్యవసాయ సహాయ కులు పవన్ జ్యోతి, రెడ్డిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

శనీశ్వరుడికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 27: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వర స్వామికి విశేష పూజలు జరిగాయి. శనివారం పురస్కరించుకుని ముందుగా అర్చకులు శనీశ్వర స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో పాటు శనిప్రీతి కోసం విశేషంగా తైలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ



కాట్రపల్లి పాఠశాలలో నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న బాబుయాదవ్

కేవీబీపురం, జనవరి27: మండలంలోని ఓళ్లూరు గ్రామానికి చెందిన బాబు యాదవ్ కుమార్తె తన్విక పుట్టినరోజు సందర్భంగా మండలంలోని కాట్రపల్లి, వగత్తూరు గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుగుణ, గుణశేఖర్, కరుణాకర్, అజిత్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

కేవీబీపురం, జనవరి27: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఆరె గ్రామం వద్ద శనివారం సాయంత్రం జరిగింది. పిచ్చాటూరు మండలం గొల్లకండ్రిగ గ్రామానికి చెందిన కన్నయ్య(59) కేవీబీపురం వచ్చాడు. అక్కడ పనులు ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. అదేసమయంలో పిచ్చాటూరు నుంచి ఎండుగడ్డి లోడుతో ఓ ట్రాక్టరు ఆరె వద్దకు చేరింది. అక్కడ కన్నయ్య రోడ్డు వారగా వెళ్లే క్రమంలో ట్రాక్టరులోని గడ్డి తగులుకుని కిందపడి గాయాల పాలయ్యాడు. కుడిచేయి విరిగింది. స్థానికులు అతడిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 27: భూ కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని హ్యూమన్‌రైట్స్ సభ్యుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రేణిగుంట మండలం మర్రిగుంట దళితవాడ సర్వే నెంబరు 12/2లోని 1.90సెంట్ల డీకేటీ భూమిని అదే గ్రామానికి చెందిన కృష్ణయ్య పేరుపై 1977వ సంవత్సరంలో డిపట్టా మంజూరు చేసినట్లు చెప్పారు. మూడు నెలలుగా రేణిగుంటకు చెందిన మురళీ మోహన్ దౌర్జన్యంగా ఆ భూమిలో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన తమపై దాడులకు పాల్పడ్డారని తెలిపారు. గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, న్యాయం చేయాలని కోరారు. కాగా మర్రిగుంట గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ హ్యూమన్‌రైట్స్ పేరు చెప్పుకుని డబ్బులు లేదా ప్లాట్స్ ఇవ్వాలని బెదిరిస్తున్నారని మురళీమోహన్ ఆరోపించారు. ఆ భూమిని వినాయక మొదలియార్ నుంచి తాను కొనుగోలు చేశానని అన్నారు. దీనిపై 2012లోనే ఇంజక్షన్ ఆర్డరు ఉందని, 2003లో హైకోర్టు తీర్పు ప్రకారం మిగిలిన ఖాళీ భూమిని కొనుగోలు చేశామని అన్నారు. రాజ్‌కుమార్‌పై గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపారు.

మాకు ఇక్కడే స్థలాలివ్వండి

- ప్రభుత్వ భూమిలో పేదల గుడిసెలు
- కరకంబాడిలో ఇంటిస్థలాల కోసం పోరు
- సీపీఎం నేతల సంఘీభావం





గుట్టపై గుడారాలు వేస్తున్న జనం, ఆందోళనకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉదయ్‌సంతోష్

రేణిగుంట, జనవరి 27: తిరుపతి-కడప రహ దారిలో అత్యంత విలువైన భూములు అవి. అక్కడ ఉన్న 30.30 ఎకరాల ప్రభుత్వ భూమిలో తమకు ఇంటి స్థలాలు, పట్టాలు ఇవ్వాలని పలు ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రెండు రోజులుగా తమకు ఇళ్లస్థలాలు ఇవ్వాలంటూ పేదలు చేస్తున్న ఆందోళనకు సీపీఎం నేతలు సంఘీభావం తెలప డంతో రెవెన్యూ, పోలీసు అధికారులు వారితో చర్చలు జరిపారు. న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి..

మండల పరిధిలోని కరకంబాడి పంచాయతీ కార్యాలయానికి సమీపంలో కడప రహదారికి ఆనుకుని ఉన్న కరకంబాడి లెక్కదాఖలా సర్వే నెంబరు 153/1 లో ఉన్న కోట్ల విలువైన 30.30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో ఇంటి స్థలాలు, పట్టాలు ఇవ్వాలని, పట్టాలున్నవారికి ఇంటి స్థలాలు చూపాలని పలువురు పేదలు కోరుతున్నారు. రేణిగుంట మండలంలో సుమారు 4వేల మంది పేదలకు జగనన్న ఇంటి పట్టాలు గతంలో ఇచ్చారు. వారికి ఇంత వరకు స్థలాలు చూపలేదు. ఈ విషయమై లబ్ధిదారులు ఆయా పంచాయతీ గ్రామసభల్లో అధికారులను, వైసీపీ నాయకులను పలుమార్లు ప్రశ్నించినా నేటి వరకు ఇంటి స్థలాలు చూపడంలో అధికారులు విఫలమయ్యారు. ఈ క్రమంలో కరకంబాడి వద్ద ఉన్న 30 ఎకరాల గుట్టపై తమకు ఇంటి స్థలాలు కేటాయించాలని పేదలు శుక్రవారం గుడిసెలు వేశారు. ఈ ఆందోళన శనివారం తీవ్రస్థాయికి చేరుకుంది. మండలంలోని పలు గ్రామాల ప్రజలతో పాటు తిరుపతి అర్బన్, ఇతర మండలాల నుంచి ఇళ్లు లేని పేదలు ఇంటి స్థలం కోసం ఈ గుట్ట ప్రాంతానికి చేరుకుని ముళ్లపొదలు, చెట్లు తొలగించి ఆ ప్రాంతం అంతా శుభ్రం చేసేందుకు ఉపక్రమించారు. వందల మంది చీరలు, పాత ఫ్లెక్సీలు, కర్రలతో గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ ఉదయ్ సంతోష్, సీఐ సుబ్బారెడ్డి కలిసి రెవెన్యూ సిబ్బంది, పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని వీటిని చాలావరకు తొలగించారు. అనంతరం తహసీల్దార్ పేదలతో సుదీర్ఘంగా చర్చించారు. అర్హులైన పేదలందరూ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఏర్పేడు మండలం పాగాలిలో జగనన్న పట్టాలు పొందిన రేణిగుంట మండలానికి చెందిన వారు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి రావాలని సూచించారు. వారికి ఇచ్చిన స్థలం కోర్టులో ఉందని అది పరిష్కారం కాగానే స్థలాలు చూపుతామని హామీ ఇచ్చారు. దీంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు.

పేదల సేవే పరమాత్ముడి సేవ: ఎమ్మెల్యే



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 27: పేదల సేవే పరమాత్ముడి సేవ అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నాడు-నేడు కింద నిర్మించిన అదనపు అంతస్తును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆశయంతో రూ.12 కోట్ల నిధులను మంజూరు చేయించామన్నారు ప్రస్తుతం కార్పొరేటుకు దీటుగా వైద్య సేవలు అందించేలా శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి సిద్ధం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువగళం వార్షికోత్సవం



నారా లోకేశ్ ఆవిష్కరించిన మైలురాయి వద్ద సంబరాలు

శ్రీకాళహస్తి, జనవరి 27: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు ఏడాది గడిచిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు శనివారం సంబరాలు నిర్వహించారు. గత ఏడాది లోకేశ్ పాదయాత్ర తొండమనాడు వద్ద 300 కిలోమీటర్ల మైలురాయికి చేరుకుంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇస్తూ అక్కడ ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అదే ప్రదేశంలో శనివారం టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు బొజ్జల రిషితారెడ్డి, కామేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపాలి

రాష్ట్రాన్ని అన్నివిధాలా దెబ్బతీసిన వైసీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో సాగనంపాలని టీడీపీ నాయకురాలు రిషితా రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి మండలంలోని అబ్బాలపల్లె రామాపురం, అదే గ్రామంలోని ఎస్టీ కాలనీ, హరిజనవాడ, అరుందతి వాడలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తిరెడ్డి, దొరైరాజ్ రెడ్డి, సుధాకర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సురుటుపల్లి పాలక మండలి సభ్యుడికి సన్మానం



పిచ్చాటూరు, జనవరి 27: సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి ఆలయ పాలకమండలి సభ్యుడు ఆనందనాయుడు పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయనను పాలేగార్ కుల సంఘ నాయకులు ఆలయంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పాలేగార్ కుల సంఘ అధ్యక్షుడు రాజేంద్రనాయుడు, రామగిరి ట్రస్టు బోర్డు ఛైర్మన్ వెంకటేశులు నాయుడు, ఎంపీటీసీ శోభన్‌బాబు, శ్రీనివాసులు, మునిచంద్ర, సురేంద్ర, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

కోనలో దారితప్పిన యువకులు రక్షించిన పోలీసులు



దారితప్పిన వారితో పోలీసులు

సత్యవేడు, జనవరి 27: విహారయాత్ర కోసం వచ్చి దారి తప్పిన యువకులను పోలీసులు రక్షించారు. సురక్షితంగా స్వస్థలానికి పంపించారు. ఈ సంఘటన శనివారం చోటు చేసుకుంది. నాగలాపురం మండలం టీపీ కోటలోని భూపతేశ్వర కోనకు చెన్నై ఆవడికి చెందిన ఐదుగురు మిత్రులు శుక్రవారం విహార యాత్రకు వచ్చారు. కోనలోకి వెళ్లే దారితెలియక, దారి తప్పినట్లు 100కి డయల్ చేశారు. ఎస్ఐ ఓబయ్య తన సిబ్బందితో అడవిలోకి వెళ్లి రాత్రి 1 గంట వరకు గాలించి దారి తప్పిన యువకులను రక్షించారు. దారి తప్పిన వారిలో నలుగురు యువకులతో పాటు ఓ యువతి ఉంది. వారిని సురక్షితంగా ఇంటికి పంపారు.

జగన్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధం: టీడీపీ



బస్సు యాత్రలో రఘురామరాజు, మాజీ ఎమ్మెల్యే హేమలత, హెలెన్

పిచ్చాటూరు, జనవరి 27: సీఎం జగన్‌ని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టి ముక్కల రఘురామరాజు తెలిపారు. శనివారం పిచ్చాటూరులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద టీఎన్‌టీయూసీ బస్సు యాత్రలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీకి వస్తున్న అనూహ్య ప్రజా స్పందనను చూసి వైసీపీ నాయకులకు మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు హయాంలోనే కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. వైసీపీ వచ్చాక బీసీలకు రిజర్వేషన్‌ను తొలగించిందని గుర్తు చేశారు. కోడి కత్తి, గొడ్డలి పోటు, గుండెపోటు డ్రామాలు అయిపోయాయని ఇక జగన్ ఇంటికెళ్లడమే మిగిలిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హేమలత, ఇన్‌చార్జి హెలెన్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జయరాంరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.37 కోట్లు

తిరుమల, జనవరి27(ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.37 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 71,664 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 33,330 మంది తలనీలాలు సమర్పించారు.

ఆధార్ కేంద్రం మూత



బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 27: బుచ్చినాయుడుకండ్రిగ సచివాలయంలో పని చేస్తున్న డిజిటెల్ అసిస్టెంట్ బదిలీ కావడంతో ఆధార్ కేంద్రం మూత పడింది. దీంతో సమీపం గ్రామాల ప్రజలు ఆధార్ సేవల కోసం శ్రీకాళహస్తి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. మండలంలో పల్లమాల, వెస్ట్‌వరత్తూరు సచివాలయాలలో ఆధార్ కేంద్రాలు ఉన్నాయి. అక్కడి సిబ్బందిని మండల సచివాలయంలో వారంలో ఒకరోజు అయినా సేవలు అందిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



శ్రీకాళహస్తి, జనవరి 27: శ్రీకాళహస్తి పట్టణ శివారు కైలాసగిరి కొండల్లోని మార్కండేయ తీర్థంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు సూచించారు. మార్కండేయతీర్థంలో జరుగుతున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ మహాశివరాత్రిలోగా కుంభాభిషేకం నిర్వహించాలని ఆలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఈ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

పార్కు ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు, జనవరి 27: చింతలగుంట చిల్డ్రన్స్ పార్కు ప్రహరీ నిర్మాణానికి మంత్రి రోజా శనివారం భూమి పూజ చేశారు. పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో వున్న చింతలగుంటలో మున్సిపల్ జనరల్ నిధులు నుంచి ఇరవై నాలుగు లక్షల రూపాయలతో ప్రహరీ నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే పుత్తూరులో పెద్ద పార్కు వుందని, పిల్లల కోసం చిన్న పార్కును కూడా త్వరలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వడమాలపేటలో కూడా ఇటీవల పద్మావతి పార్కును ప్రారంభించామని, నగరిలో ఫిబ్రవరి 10న పెద్ద పార్కును ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హరి, కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, వైసీపీ నాయకులు జయప్రకాష్, శంకర్, నరసింహారావు, ఏకాంబరం, పాండురంగం యాదవ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ అడ్వాన్స్‌డ్ కోర్సులతో ఉద్యోగావకాశాలు



కంపెనీ నిపుణులతో కళాశాల అధ్యాపకులు

నారాయణవనం, జనవరి 27: స్కిల్ అడ్వాన్స్‌డ్ కోర్సులతో ఉద్యోగావకాశాలు ఉంటాయని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ అశోకరాజు పేర్కొన్నారు. స్కిల్ అడ్వాన్స్‌డ్ కోర్సు డీప్ లెర్నింగ్‌పై ఐదు రోజుల వర్క్‌షాపు ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాల్గవ సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విద్యార్థులకు ఐదు రోజుల వర్క్‌షాపు విజయవంతంగా ముగిసిందన్నారు. వివిధ కంపెనీలకు చెందిన నిపుణల ద్వారా విద్యార్థులు పలు రకాల మెలకువలను నేర్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బరాజు, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, జనార్దన్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ గోపీనాథ్, హెచ్‌వోడీలు గీతావాణి, రాజకుమార్, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ కుమార్, నిపుణులు అర్జున్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యువతలో ప్రతిభను వెలికితీయడానికే క్రీడా పోటీలు

పుత్తూరు, జనవరి 27: గ్రామీణ యువతలో క్రీడా ప్రతిభను వెలికితీయడానికే ఆడుదాం.. ఆంధ్ర.. కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంత్రి రోజా తెలిపారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నియోజకవర్గస్థాయి ఆటల పోటీలను శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక దృఢత్వం కోసం క్రీడలు ఎంతో అవసరమని చెప్పారు. జీవితంలో కూడా పోటీపడి గెలిచేందుకు క్రీడాస్ఫూర్తి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసరు మురళి, నగరి ఆర్డీవో సుజన, మున్సిపల్ ఛైర్మన్ హరి, ఎంపీపీ మునివేలు, కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, వైసీపీ నాయకులు మాహీన్, జయప్రకాష్, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రిక్ వర్కర్స్ డే

పుత్తూరు అర్బన్, జనవరి 27: ఎలక్ట్రిక్ వర్కర్స్ దినోత్సవాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ద్రౌపదీదేవి ఆలయం నుంచి ప్రైవేట్ ఎలక్ట్రిక్ వర్కర్స్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. థామస్ ఆల్వా ఎడిసన్ ఎలక్ట్రిక్ బల్బును కనుగొన్న రోజును ఎలక్ట్రిక్ వర్కర్స్ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కే.చిట్టిబాబు తెలిపారు. అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్, మాజీ ఎంపీపీ డీఎన్ ఏలుమలై వంద మంది ఎలక్ట్రిక్ వర్కర్లకు బీమా పాలసీ అందించేందుకు నగదు సహాయాన్ని అందించారు. అనంతరం కార్మికశాఖ ఇన్‌స్పెక్టర్ హేమాచారి, ఎస్పీడీసీఎల్ అధికారి రవిచంద్రన్ మాట్లాడుతూ వర్కర్స్‌కు ఇన్సూరెన్స్ పాలసీలు, విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్త గురించి సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వి.బాలమురళి, కార్యదర్శి ఎన్ఆర్ రమేష్, జాయింట్ సెక్రటరీ జే.గోవిందరాజులు, ట్రెజరర్ ఏ.జయరాం తదితరులు పాల్గొన్నారు.